ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 13 సెప్టెంబరు 2025



యూరియా విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉష

యూరియాపై ఆందోళన వద్దు

- జిల్లా వ్యవసాయాధికారి ఉష
- మంగల్‌పల్లిలో యూరియా విక్రయ కేంద్రం తనిఖీ

ఆదిభట్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు కావలసిన యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి ఉష పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మంగల్‌పల్లి పీఏసీఎస్‌లోని యూరియా విక్రయా కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం యూరియా సరఫరా ఉంటుందన్నారు. రైతులు యూరియా బస్తాలు కొనుగోలు చేసి నిలువ చేసుకోవద్దన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి గత వానాకాలంలో 860 టన్నుల యూరియా సరఫరా కాగా, ఈ సీజన్‌లో ఇప్పటికే 850 టన్నుల పంపిణీ చేశామన్నారు. మరో వారం రోజుల్లో నియోజకవర్గానికి 60 టన్నుల బస్తాలు వస్తాయని తెలిపారు. అనంతరం ఎంపీ పటేల్‌గూడలో మెట్టు అశోక్‌రెడ్డి పండిస్తున్న కేఎన్‌ఎం 1638 వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఏడీఏ పద్మజ, ఏడీఏ సుజాత, ఏసీపీ కేపీవీ రాజు, ఏవో హరినాథ్, ఎంఏవో విద్యాధరి, సహకార సంఘం సెక్రటరి మాధవి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, సీఐ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు



ప్రిన్సిపాల్ రాధిక

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి ఈనెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి కమిషనర్, కళాశాల విద్య ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇంత వరకు రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు, రిజిస్ట్రేషన్ చేసుకుని సీటు పొందని వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు వచ్చి సీట్లు ఖాళీగా ఉన్న కోర్సుల్లో చేరవచ్చని ఆమె తెలిపారు.

స్కావెంజర్ల జీతాల్లో స్కాంపై విచారణ

నివేదిక ఇవ్వాలని డీఈవో ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహేశ్వరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహేశ్వరం మోడల్ స్కూల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిధులు గోల్‌మాల్‌పై 'ఇదేమి ఆదర్శం?.. స్కావెంజర్ల జీతాల్లో స్కాం' అనే శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. దీనిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని మండల విద్యాధికారి కస్నానాయక్‌ను జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఆదేశించారు. దీంతో మోడల్ స్కూల్లో నిధుల అక్రమాలపై ప్రిన్సిపాల్ గోపిని ఎంఈవో వివరణ కోరారు. అలాగే నిధులకు సంబంధించిన చెక్కులు, తదితర విషయాలపై విచారణ చేపట్టారు. దీనికి సంబంధించిన నివేదికను త్వరలో జిల్లా విద్యాధికారికి అందజేస్తామని వివరించారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వానాకాలం పంటలు కళకళలాడుతున్నాయి. కనుచూపు మేరలో ఎక్కడ చూసినా పచ్చదనమే దర్శనమిస్తోంది. ఈ వానాకాలం సీజన్‌లో మూడు జిల్లాల్లో ఇప్పటి వరకు కురవాల్సిన సాధారణ వర్షపాతం కంటే అధికంగా కురిసింది. చెరువులు, కుంటలు నిండు కుండలను తలపిస్తున్నాయి. భూగర్భ జలాలు దండిగా పెరిగాయి. దీంతో పంటల సాగు కూడా గణనీయంగా పెరిగింది. అలాగే రానున్న యాసంగిలోనూ సాగుకు నీటి కొరత ఉండే అవకాశం లేదు. సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ రైతులను యూరియా కొరత మాత్రం వేధిస్తోంది. నిత్యం నత్రజని కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



శంకర్‌పల్లి మండలం పిల్లిగుండ్లలో వరి చేను

సాగు కళకళ

వానాకాలంలో గణనీయంగా పెరిగిన పంటలు

వర్షపాతం ఇలా..

జిల్లా	సగటు	ప్రస్తుతం	శాతం
రంగారెడ్డి	452.4	672.8	49 అధికం
వికారాబాద్	554	710.7	28 అధికం
మేడ్చల్	505.3	626.8	24 అధికం

జిల్లాల వారీగా పంటల సాగు శాతం

రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
94.70	92.10	89.28



కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లిలో జొన్న చేను

- సగటుకు మించి వరి, పత్తి, మొక్కజొన్న సాగు
- వికారాబాద్‌లో రికార్డుస్థాయిలో 2.52లక్షల ఎకరాల్లో పత్తి
- రంగారెడ్డిలో అధికంగా వరి, మొక్కజొన్న పంటలు
- రైతులను వేధిస్తున్న యూరియా కొరత

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : వర్షాలు విస్తారంగా కురవడంతో ఈ సారి వానాకాలం సీజన్ (ఖరీఫ్) కళకళలాడుతోంది. దాదాపు నెల రోజుల నుంచి మూడు జిల్లాల్లో దండిగా వర్షాలు పడడంతో పంటల సాగు అనూహ్యంగా పెరిగింది. దీంతో ఈ ఖరీఫ్ సీజన్ గట్టెక్కింది. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఈ సీజన్ పంటల సాగు దాదాపు సగటుకు చేరుకుంది. ఇప్పటికే మొక్కజొన్న, వరి, పత్తి పంటలు సగటుకు మించి రైతులు సాగు చేశారు. వరి సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం సన్నరకం బియ్యానికి ప్రోత్సాహకం అందిస్తున్న విషయం తెలిసిందే. దీంతో రైతులు సన్నాలు సాగు చేసేందుకు ఆసక్తి చూపారు. దీంతో వరి సాగు వందశాతం దాటింది. అలాగే రంగారెడ్డి జిల్లాలో అంచనాలకు మించి మొక్కజొన్న పంట సాగు చేశారు. వికారాబాద్ జిల్లాలో పత్తి రికార్డుస్థాయిలో సాగు చేయడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 2.52లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేశారు. అయితే ఇక్కడ కందితో పాటు మొక్కజొన్న పంటల సాగు గణనీయంగా తగ్గింది. మొత్తం మీద ఈ ఖరీఫ్ సీజన్‌కు వాతావరణం అనుకూలించడంతో ఉమ్మడి జిల్లాలో ఆశించిన స్థాయిలో రైతులు పంటలు వేశారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కురవాల్సిన వర్షం కంటే మూడు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. రంగారెడ్డిజిల్లాలో 49శాతం అధికంగా, వికారాబాద్ జిల్లాలో 28శాతం అధికంగా, మేడ్చల్ జిల్లాలో 24శాతం అధిక

మిగతా 7వ పేజీలో...



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య

చేవెళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ జనాభా అధికంగా ఉన్నప్పటికీ వారికి సమన్యాయం జరగటం లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ బంధుకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టి వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. రాజ్యాంగం ప్రకారం బీసీలకు హక్కులు కల్పించడంలో కేంద్రం మొద్దునిద్ర పోతుందన్నారు. ఎన్నికల సమయంలో బీసీల కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం. ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, మండల కన్వీనర్ పడమటి వెంకటయ్య, షాబాద్ మండల కన్వీనర్ జి. నర్సింహ, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు మగ్బుల్, మంజుల ఉన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకుంటే

అద్భుత అవకాశాలు

- ఏఐలో నిష్ణాతులు కావాలి
- మార్పులను చాలెంజ్‌గా స్వీకరించాలి
- తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకునే విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అపూర్వ అవకాశాలున్నాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.నీత ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రెండు రోజుల ఏఐ జాతీయ కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సాంకేతిక విప్లవంతో ఎన్నో మార్పులు వస్తున్నాయని, ఇందులో భాగంగా ఏఐ అనే టూల్స్ వచ్చిందని గుర్తు చేశారు. అన్ని రంగాలకు అనుసంధానంగా పనిచేస్తున్న ఏఐని ప్రతీ విద్యార్థి నేర్చుకోవాల్సిన అవశ్యకత ఏర్పడిందని గుర్తుచేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం ఏఐ టూల్‌ను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐపై కాన్ఫరెన్స్‌లు పెట్టే కళాశాలలో ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం చేసి, ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నిరంగాల్లో దోహదపడుతున్న కృత్రిమ మేధస్సు(ఏఐ)ను ప్రతీ విద్యార్థి నేర్చుకోవాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సైతం విద్యార్థులు నిత్యం వచ్చి, ఏఐ లాంటి సాంకేతిక విజ్ఞానాన్ని పెంచుకునే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ కె. వేణుగోపాల్‌రావు, జిల్లా రీజినల్ డైరెక్టర్ కె. నాగార్జునరావు, షాద్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జాతీయ మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రామసుబ్రమణియన్

దేశం గర్వించే పౌరులుగా ఎదగాలి

- జాతీయ మానవహక్కుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ వి.రామసుబ్రమణియన్
- ఇక్ఫాయి కళాశాలలో స్నాతకోత్సవం

శంకర్‌పల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశం గర్వించేలా పౌరులు ఎదగాలని జాతీయ మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు జస్టిస్ వి.రామసుబ్రమణియన్ తెలిపారు. శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లి వద్ద గల ఇక్ఫాయ్ కళాశాలలో శుక్రవారం పీహెచ్‌డీ, ఎంబీఏ, బీబీఏ, ఎల్ఎల్ఎమ్, బీటెక్ విద్యార్థుల స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ సి. రంగరాజన్‌తో కలిసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు అమెరికాకు చెందిన శాస్త్రవేత్త బెంజమిన్ ఫ్రాంక్లిన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఆయన జీవితం సవాళ్లతో కూడిన పరిస్థితుల నుంచి ఎలా ఎదగవచ్చో, సమాజానికి ఎలా దోహదపడవచ్చో సూచిస్తుందన్నారు. ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని వివరించారు. ఇక్ఫాయి యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ సి.రంగరాజన్ మాట్లాడుతూ నాణ్యత ప్రభావం పరంగా ఉన్నత విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ రంగనిపుణులు సుభాష్ పాలేకర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు దీపక్‌పరేక్, ఇక్ఫాయి వైస్‌చాన్స్‌లర్ కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.



సంగెంలో నిరంతరం వెలుగుతున్న స్ట్రీట్ లైట్



కొత్తపేటలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌కో.. జర దేఖో!

కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు.. తరచూ విద్యుత్ ప్రమాదాలు
పగలూ వెలుగుతున్న స్ట్రీట్‌లైట్లు.. పట్టించుకోని అధికారులు

కేశంపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సమస్యలపై దృష్టిసారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కేశంపేట మండల పరిధిలోని గ్రామాలలో స్ట్రీట్‌లైన్ లేక వీధి దీపాలు పగలు రాత్రి అనే తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. అలాగే కంచెలేని ట్రాన్స్ ఫార్మర్‌లతో ప్రమాదాలు పొంచి ఉన్నా పట్టించుకోవడం లేదు.

వేములనర్వ, సంగెం, కొత్తపేట, అల్వాల, లింగంధన గ్రామాలలో వీధిదీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. అధికారులు పట్టించుకోక పోవడంతో కరెంట్ వృధా అవుతోంది. కొత్తపేట, ముదార్‌పూర్, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, నిర్దవెల్లి, బైర్కాన్‌పల్లి, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొనాయపల్లి, పాటిగడ్డ, చౌలపల్లి గ్రామాలలో

మిగతా 8వ పేజీలో...

ప్రమాదాలు జరగకుండా చూడాలి



ప్రమాదాలు జరిగినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వదులుగా ఉన్న విద్యుత్ తీగలను, ఒరిగిన స్తంభాలను సరిచేయాలి. ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద కంచె లేక పోవడంతో మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

అనుముగళ్ల రమేష్, మాజీ ఉపసర్పంచ్, పోమాల్‌పల్లి



ఎన్కేపల్లి మాల కుంటను పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

నాలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు

- త్వరలో నాలాలు, చెరువులు, కుంటల సంయుక్త సర్వే
- చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్ కుమార్

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు12(అంధ్యజ్యోతి): చెరువులు, కుంటలు, నాలాలను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరించారు. ఇటీవల మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లిలోని మాలకుంట చెరువు శిఖం భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలిసి వారు శుక్రవారం తొలగించారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి సర్వే నిర్వహించి చెరువు భూమిని రక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని సురంగల్, చిలుకూరు, తోలుకట్ట, కేతిరెడ్డిపల్లి, అప్పారెడ్డిగూడ తదితర గ్రామాల్లో నాలాలు, చెరువుల సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల నిర్వీర్యానికి కుట్ర

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్



మండల కేంద్రంలో మాట్లాడుతున్న దుబ్బాక రాంచందర్

కందుకూరు, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమంతో సాధించుకున్న కార్మిక చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేయడానికి నరేంద్రమోడీ ప్రభుత్వం కుట్రలు పన్నిందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాష నరహరి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన మండల ఆశా వర్కర్ల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను కాలరాసే పద్ధతుల్లో ఉన్నాయన్నారు. హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న కార్మికులపై అనేక నిర్బంధాలు ప్రయోగిస్తూ వారి నడ్డి విరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 20ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఆశావర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలను మంజూరు చేయలేని దుర్భర పరిస్థితి నెలకొన్నదన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వారికి నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలన్నారు.

నూతన కార్యవర్గం

ఆశావర్కర్ల సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ మండల కన్వీనర్ బుర్రీపు శ్రీనివాస్ ప్రకటించారు. గౌరవ అధ్యక్షురాలిగా ఎం.సరస్వతి, అధ్యక్షులుగా ఆండాలు, ఉపాధ్యక్షులుగా ఐలమ్మ, సంధ్య, జ్యోతి, ప్రధానకార్యదర్శిగా శ్రీలత, సహాయ కార్యదర్శులుగా కళమ్మ, రాధిక, మంజుల, కోశాధికారిగా చైతన్యలతో పాటు 15మందితో కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో సీఐటీయూ మండల నాయకులు శేఖర్, ఆశా వర్కర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి



వినతి పత్రాన్ని అందజేస్తున్న నర్సింహారెడ్డి

కొత్తూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. జీపీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీవో విజయలక్ష్మీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పండుగ వస్తున్న నేపథ్యంలో వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ప్రధానకార్యదర్శి శేఖర్‌రెడ్డి, జీపీ కార్మిక నాయకులు సురేష్, భిక్షపతి, దేవమ్మ, చంద్రయ్య, మైసయ్య, రవీందర్, భారతమ్మ పాల్గొన్నారు.

ఈ రోజైనా దొరికేనా..?

- యూరియా కోసం క్యూలో రైతన్నలు
- గంటల తరబడి పడిగాపులు
- ఒక్కో రైతుకు ఒక్క బస్తానే..

7

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

చేవెళ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు అన్నారు. శుక్రవారం చేవెళ్ల కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్అదాలత్‌లో మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 40 మందిపై రూ.67 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సై చందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.







శిలాఫలకంతోనే సరి!


బీటీ రోడ్డు నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం


ఆలూర్ నుంచి న్యాలట వెళ్లే మట్టి రోడ్డు

రెండేళ్లు దాటినా ప్రారంభం కాని పనులు

అధ్వానంగా ఆలూర్ - న్యాలట రోడ్డు

కంకర తేలడంతో తప్పని అవస్థలు

పట్టించుకోని అధికారులు, పాలకులు

చేవెళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూర్ గ్రామం నుంచి న్యాలట గ్రామం వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. అప్పుడు మంత్రులుగా ఉన్న సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ప్రజాప్రతినిధులు ఎంతో ఆర్భాటంగా 7 సెప్టెంబరు 2023న రూ.4 కోట్ల 50 లక్షలతో బీటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శిలాఫలకం వేసి రెండేళ్లు దాటినా తట్టెడు మట్టికూడా వేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆలూరు ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

ఆలురు గ్రామంపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరై రెండు సంవత్సరాలు పూర్తయినా రోడ్డు పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని ఆరోపిస్తున్నారు. హైదరాబాద్, బీజాపూర్ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారడంతో అధికారులు మార్గ మధ్యలో నుంచి ఉన్న రోడ్డు గుండా వెళ్తున్నారు. వర్షం పడితే రోడ్డుపై వాహనాలు వెళ్లడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. ఓట్ల కోసం వచ్చిన నేతాలంతా బీటీ రోడ్డు పనులను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి రెండేళ్లు అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువైయ్యాడని ఆలూరు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనులు ప్రారంభం కాలె..



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలూరు గ్రామం నుంచి న్యాలట రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికి రెండేళ్లు దాటినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. నిధులు మంజూరు అయ్యాక పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అధికారులు, పాలకులు సమస్యను గుర్తించాలి.

- తోట చంద్రశేఖర్,
బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఆలూర్ గ్రామానికి నక్ష రోడ్డు బీటి రోడ్డుగా మారుస్తున్నమాని చెప్పిన గత ప్రభుత్వం శిలాఫలకం వేసి రెండేళ్లయింది. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు చేవెళ్ల పట్టణ కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలి.

- అంజనేయులు యాదవ్,
బీజేపీ నాయకుడు, ఆలూరు

సహకార రంగంలో సమూల మార్పులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


కేశవరెడ్డికి ఉత్తర్వు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

తలకొండపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటూ సహకార రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి పీఏసీఎస్ పాలక వర్గం కాలపరిమితిని పెంచుతూ ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. శుక్రవారం పీఏసీఎస్ ఛైర్మన్ గట్ల కేశవ రెడ్డి, డైరెక్టర్లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కాలపరిమితి పెంపు ఉత్తర్వులు కేశవ రెడ్డికి ఎమ్మెల్యే అందజేశారు. సకాలంలో పంట రుణాలు అందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. యూరియా కొరత రాకుండా, సకాలంలో రైతులకు పంపిణీ చేయాలని పాలక వర్గానికి కసిరెడ్డి ఆదేశించారు. కేంద్రం రాష్ట్రానికి తగినంత మేర యూరియా కేటాయింపులు చేయకపోవడం వల్లే ఇబ్బందులు వచ్చాయని చెప్పారు. విపక్షాల ఉచ్చులో పడి రైతులు నష్టపోవద్దని సూచించారు. సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తామన్నారు. ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షలలోపు పంట రుణాలను సీఎం రేవంత్ రెడ్డి మాఫీ చేశారని పేర్కొన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న చెరువులు, కుంటలు, గ్రామీణ రోడ్ల మరమ్మతులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం, సురేందర్ రెడ్డి, వెంకటయ్య, సుమన్, వెంకటేశ్, కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో శుక్రవారం సీపీఎం మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సిరెడ్డి హాజరై మాట్లాడారు. బ్రాహ్మణ వర్గంలో పుట్టినా అట్టడుగు వర్గాల ప్రజల కోసం ఏచూరీ చేసిన సేవలు మరువలేమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, నాయకులు సామేల్, నర్సింహ, జగన్, శ్రీనివాసరెడ్డి, జంగయ్య, బుగ్గరాములు, ఎల్లేష్, పురుషోత్తం, శారద, అరుణ పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరుకు అర్హులను గుర్తించండి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


అభివృద్ధి, సంక్షేమంపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించేందుకు ఇందిరమ్మ కమిటీలతో కలిసి అర్హులను గుర్తించాలని వార్డు అధికారులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటేషన్‌పై ఇతర మున్సిపాలిటీలకు వెళ్లిన అధికారులను తిరిగి రప్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం డీసీసీబీ వైస్ ఛైర్మన్ రవిగౌడ్ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ స్వప్న మాట్లాడుతూ అధికారులు కాంట్రాక్టర్లకు బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ. 55 కోట్లతో శాశ్వత పరిష్కారం

తాండూరులో తాగు నీటి సరఫరాకు సంబంధించి పురాతన పైపులైన్లను మార్చడం తోపాటు ఒక రిజర్వాయర్ ఏర్పాటుకు రూ.55 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో అవసరమైన చోట సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. అలాగే లారీ పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయిం చామని తెలిపారు.

కుక్కలకు తప్పనిసరిగా టీకా వేయించాలి


కుక్కలకు టీకా వేస్తున్న బ్లూక్రాస్ సిబ్బంది

శామీర్‌పేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుక్కలకు యజమానులు ఏడాదికోసారి యాంటి రేబీస్ టీకా వేయించాలని బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ డైరెక్టర్ కుమారి సూచించారు. శుక్రవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద బ్లూక్రాస్, డబ్ల్యూవీఎస్, మిషన్ రేబీస్, తూంకుంట మున్సిపల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన యాంటి రేబీస్ టీకా వ్యాక్సినేషన్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ బ్లూక్రాస్ వారి సహకారంతో మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో యాంటి రేబీస్ టీకా మొబైల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తూంకుంట పరిధిలో మొత్తం 190 పెంపుడు, వీధి కుక్కలకు ఏఆర్‌వి టీకాలు వేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



కీసర రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ స్థలాల కబ్జాకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కీసర మండల పరిధిలోని నాగారం మున్సిపల్ టౌన్‌లోని సర్వే నంబర్ 83 చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఎక్సకవేటర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించటంతోపాటు బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పాటునందించాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉప్పల వెంకటేశ్

ఆమనగల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ ఛైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. కందుకూరు మండల కేంద్రంలో ఈనెల 27న నిర్వహించే టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా 3వ మహాసభకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల టీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, హెల్త్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఆమనగల్లు బ్లాక్ సమన్వయ కమిటీ అధ్యక్షుడు యూనుస్, జిల్లా నాయకుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు చంద్రకుమార్, యూనియన్ అధ్యక్షుడు దురువుల శంకర్, గౌరవాధ్యక్షుడు రాచాలపల్లి నర్సింహ, నాయకులు తిరుపతి, నాయకులు తావుర్య నాయక్, విజేందర్‌రెడ్డి, బుచ్చిబాబు, శివకుమార్, రఘుపతిరెడ్డి, రాజవర్ధన్ రెడి ఉన్నారు.

నేడు జర్నలిస్టులకు వైద్యశిబిరం

ఆమనగల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆమనగల్లు పట్టణంలో జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. వన్ మెడిహబ్, ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

స్వదేశీ జాగరణ్ మంచ్ కమిటీ ప్రకటన



స్వదేశీ జాగరణ్ మంచ్ కమిటీ సభ్యులు

వికారాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా కమిటీని శుక్రవారం ప్రకటించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాలమూరు విభాగ్ సహ కార్యవాహ కేరెల్లి అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ రూపుదిద్దుకుంది. ఈ కమిటీలో భాను మహేందర్ రెడ్డి జిల్లా కన్వీనర్‌గా ఎం.సుజాత మహిళా కన్వీనర్‌గా ఎల్.మహేందర్ రెడ్డి పర్యావరణ ప్రముఖ్‌గా ప్రేమ్‌కుమార్ ప్రచార ప్రముఖ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అలాగే కోకన్వీనర్లుగా కె.వెంకట్(వికారాబాద్), ఈ.ంజనేయులు(పరిగి), శివశంకర్ (తాండూరు), భాను ప్రకాశ్‌లొంటే(కొడంగల్) నియమితులయ్యారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ రాష్ట్ర కోకన్వీనర్ ఈశ్వర్ పాలమూరు విభాగ్ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, విభాగ్ కుటుంబ ప్రబోధక్ ఎలకంటి పురుషోత్తం, వికారాబాద్ కన్వీనర్ సురేష్ గౌడ్, పరిగి కన్వీనర్ కోస్గి కృష్ణ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విడవని వాన


గట్టేపల్లి తండా వద్ద రోడ్డుపై వరద


రాంపూర్ తండాలో దెబ్బతిన్న వేరుశనగ పంట

ధారూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వాన వీడడం లేదు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు మండలంలో వర్షం దంచి కొట్టింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు ప్రవహిస్తున్నాయి. గట్టేపల్లి అడవిలోని బాలోని కుంట నీరు గట్టేపల్లి చెరువులోకి దూకడంతో చెరువులోని నీరు గట్టేపల్లి తండా సమీపంలోని రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో గట్టేపల్లి నుంచి ధారూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. రుద్రారం రోడ్డు ద్వారా గట్టేపల్లి వాసులు ధారూరుకు రాకపోకలు సాగించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి


ప్రతిజ్ఞ చేస్తున్న సాధన ఎన్జీవో సభ్యులు

వికారాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల్య వివాహాలను నిర్మూలించేందుకు అన్ని మతాల పెద్దలు కృషి చేయాలని సాధన ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ రమేష్ యాదవ్ కోరారు. శుక్రవారం అనంతపద్మనాభస్వామి ఆలయంలో పురోహితులు, పలు మసీదుల్లో ఖాజీలతో సాధన ఎన్జీఓ ప్రతినిధులు బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. బాల్య వివాహం చేయడతో కొంత మంది నిరక్షరాస్యులుగా మారిపోతున్నారని, గృహ హింసకు గురై మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రసూతి, శిశు మరణాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నర్సింహులు, రమేష్, రోజా, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు

మొయినాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తున్నదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీరాంనగర్, చాకలిగూడ, నక్కలపల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కేంద్రం అత్యధికంగా నిధులు ఇస్తున్నదని తెలిపారు. పేదల సంక్షేమానికి మోది సర్కార్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు శ్రీరాంనగర్ ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంత్, చంద్రశేఖర్ రెడ్డి, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

» ఏసీపీ వెంకట్‌రెడ్డి



రోడ్డు ప్రమాదాలపై చర్చిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

శామీర్‌పేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. శామీర్‌పేట వద్ద రాజీవ్‌రహదారిలో సరైన రోడ్డు, సిగ్నల్స్ లేక రోడ్డు ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని, నివారణకు వెంటనే పరిష్కార మార్గాలను అన్వేషించాలని గురువారం ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఏసీపీ వెంకట్‌రెడ్డి శామీర్‌పేట వద్ద రాజీవ్‌రహదారి సర్వీస్‌రోడ్డులో, నల్సార్ జంక్షన్‌లో జరుగుతున్న డేంజర్ జోన్ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక నాయకులతో కలిసి చర్చించారు. వాహనదారులు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, యూటర్న్ చేసేటప్పుడు నిదానంగా వెళ్లాలని సూచించారు. త్వరలోనే రోడ్డు ప్రమాదల నివారణకు కట్టు దిట్టమైన భద్రత చర్యలు చేపడుతానన్నారు. కార్యక్రమంలో శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, తూంకుంట మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 నిర్వహణపై విచారణ జరిపించాలి



చేవెళ్లలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

చేవెళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నందున సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షను తిరిగి నిర్వహించి, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకుల ఆధ్వర్యంలో హైదరాబాద్-బీజాపూర్ హైవేపై ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, టీజీపీఎస్సీ వైఫల్యం కారణంగా అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని వాపోయారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు భాస్కర్, రాఘవేందర్, రవి కుమార్, పృథ్వీరాజ్, పాండు, సతీష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

» జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గట్టుపల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కాంగ్రెస్ ముఖ్యనాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. నాయకులు కె.రాకేష్‌రెడ్డి, పాండునాయక్, యాదయ్య, వెంకటేష్, శ్రీనివాస్, కమళమ్మ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి 'ఆవోపా' సేవలు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదపిల్లల విద్యాభివృద్ధికి ఆవోపా(ఆర్యవైశ్య అధికారుల సంక్షేమ సంఘం) విశేష సేవలు అందిస్తున్నదని ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ తెలిపారు. షాద్‌నగర్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆవోపా రంగారెడ్డి జిల్లా రూరల్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా షాద్‌నగర్‌కు చెందిన తాటి రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శిగా గుగ్గిళ్ల బాలరాజేష్, కోశాధికారిగా గుడిపల్లి వెంకటరమణ, అదనపు సెక్రటరీగా ఎంవీఎస్ సురేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భీమ్‌శెట్టి శ్రీనివాసగుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా పెంద్యాల నీరజ, ప్రధాన కార్యదర్శిగా తాటి సుమలత, కోశాధికారిగా భీమ్‌శెట్టి సురేఖ, అదనపు ప్రధాన కార్యదర్శిగా దండు శిరిష, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పసుపుల కవితలచే శంకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు నాగిళ్ల గోపాల్ గుప్తా, వందనపు శిల్ప, కట్టా రవి, గందే సురేష్, మలిపెద్ది శ్రీనివాస్‌గుప్త, టి.స్వరాజ్‌బాబు, పెంద్యాల జగదీశ్వర్, నాగరాజు, నందకిషోర్, ఎలుకుర్తి నారాయణ, శ్రీలత, కల్వ మాణిక్యం కల్వ మధుప్రియ, ఎంసాని శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్ పాల్గొన్నారు.

ఈ రోజైనా దొరికేనా..

» యూరియా కోసం క్యూలో రైతన్నలు

» గంటల తరబడి పడిగాపులు

» ఒక్కో రైతుకు ఒక్క బస్తానే..



యాచారం రైతు వేదికలో యూరియా కోసం రైతుల పడిగాపులు

పరిగి/యాచారం/కొడంగల్ రూరల్/మోమిన్‌పేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. నెలలు గడుస్తున్నా ఎరువు సమస్య తీరడం లేదు. ఆగస్టు మొదటివారం నుంచి రైతులు యూరియా బస్తాల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం సైతం ఎరువుల దుకాణాలు, సొసైటీలు, రైతు వేదికల వద్ద రైతన్నలు పడిగాపులు కాశారు. ఈ రోజైనా దొరుకుద్దని క్యూలో గంటల తరబడి నిలబడ్డారు. అందరికీ బస్తాలు దొరకకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. యూరియా కోసం పరిగిలోని ఆగ్రోస్, లక్ష్మీ, మనగ్రోమోర్ ఏజెన్సీల వద్ద బారులు తీరారు. యాచారం మండలంలో రెండు రోజుల ముందు పోలీస్ అధికారుల సమక్షంలో సొసైటీ అధికారులు రైతులకు స్లిప్‌లు ఇచ్చి యూరియా అందిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో మండలంలో 900 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం రైతు వేదికలో 220 బస్తాలు, రుద్రారం రైతు వేదికలో 220 యూరియా బస్తాలను రైతులకు అందించారు. రైతులు ఆందోళన చెందొద్దని మోమిన్‌పేట్ మండల వ్యవసాయ శాఖ అధికారి జయశంకర్ అన్నారు. మేకవనంపల్లి, మోమిన్‌పేట్ సొసైటీల్లో నిల్వ ఉన్న యూరియా బస్తాలను పరిశీలించారు. మేకవనంపల్లిలో 150 బస్తాలు, మోమిన్‌పేట్‌లో 100 బస్తాలు యూరియా అందుబాటులో ఉందని అవసరమైతే మరో రెండు లారీల యూరియాను తీసుకొవచ్చి రైతులకు అందిస్తామన్నారు.



పరిగిలో ఎరువుల దుకాణం వద్ద క్యూలో రైతులు



రుద్రారం రైతు వేదికలో టోకన్‌లు తీసుకుంటున్న రైతులు



మోమిన్‌పేట్: మేకవనంపల్లిలో స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సాగు కళకళ

(ఐదో పేజీ తరువాయి)

వర్షపాతం కురిసింది. మూడు జిల్లాల్లో ఆగస్టు నెలలో సగటుకు దాదాపు రెట్టింపు స్థాయిలో వర్షాలు కురిశాయి. అన్ని ప్రాంతాల్లో చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. భూగర్భజలాలు దండిగా పెరిగాయి. దీంతో పంటలకు ఇక ఢోకా లేదు. ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తోంది. వచ్చే రబీ (యాసంగి సీజన్)లో కూడా నీటి కొరత ఉండే అవకాశం లేదు. అయితే ప్రస్తుత వర్షాలతో పంటలు కళకళలాడుతున్నప్పటికీ రైతులకు ఎరువుల కొరత ఇబ్బందికరంగా మారింది. అనేక చోట్ల యూరియా కోసం రైతులు యుద్ధం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో దిగుబడులపై ప్రభావం పడుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రంగారెడ్డిలో సగటుకు మించి వరి, మొక్కజొన్న సాగు

మూడు జిల్లాల్లో ఆయా పంటల సాగు గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలను రైతులు అధికంగా వేశారు. రంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 3,84,020 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా ఇప్పటి వరకు 3,63,649 ఎకరాల్లో (94.7శాతం) వేశారు. సగటుకు మించి వరి, మొక్కజొన్న రైతులు సాగు చేశారు. ఈ సీజన్‌లో 1,21,286 ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉండగా.. ఇప్పటికే 1,27,420 ఎకరాల్లో వేశారు. ఇంకా వరి సాగు పెరగవచ్చని అధికారులు తెలిపారు. అలాగే 56133 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేయాల్సి ఉండగా అంతకు మించి 68654 ఎకరాల్లో పంట వేశారు. 1,62,771 ఎకరాల్లో పత్తి వేయాల్సి ఉండగా 1,38,780 ఎకరాల్లో సాగు చేశారు. కంది, జొన్న పంటల సాగు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ రెండు పంటల సాగు 60శాతానికి మించ లేదు.

వికారాబాద్‌లో రికార్డుస్థాయిలో పత్తిసాగు

అలాగే వికారాబాద్ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో



కోట్‌పల్లి మండలం బర్వాగ్‌లో పసుపు పంట



శంకర్‌పల్లి మండలం సంకెపల్లిలో పత్తి చేను

5,94,902 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేయగా ఇప్పటి వరకు 5,46,827 ఎకరాల్లో (92.10శాతం) వేశారు. రికార్డుస్థాయిలో పత్తి, వరి పంటలు సాగు చేశారు. ఈ ఏడాది పత్తిని 2,44,390 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటికే అంతకు మించి 2,52,194 ఎకరాల్లో (103శాతం) పంట వేశారు. 1.47లక్షల ఎకరాల్లో కంది సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 1.05లక్షల ఎకరాల్లో పంట వేశారు. అలాగే 119290 ఎకరాల్లో వరి చేయాలని నిర్ణయించగా అంతకు మించి 1,30,549 ఎకరాల్లో సాగు చేశారు. వరి పంట మరింత పెరిగే అవకాశం ఉంది. ఇక మొక్కజొన్న 42166 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 30,366 ఎకరాల్లో పంటను చేశారు. అలాగే మేడ్చల్ జిల్లాలో 23430 ఎకరాల్లో పంటలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 20920 ఎకరాల్లో (89.28శాతం) సాగు చేశారు.

రైతులను వేధిస్తున్న యూరియా కొరత

పంటలు సాగు పెరిగినా మూడు జిల్లాల్లో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. అయితే మార్కెట్‌లో సరిపడా దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు అన్ని మండలాల్లో ఇదేపరిస్థితి నెలకొంది. యూరియా కోసం ఎరువుల దుకాణాల వద్ద రైతులు బారులు తీరి కనిపిస్తున్నారు. తెల్లవారు జామునే షాపుల వద్ద రైతులు క్యూ కట్టి పడిగాపులు కాస్తున్నారు. యూరియా కొరత కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పులు మొదలయ్యాయి. రైతులకు సరిపడా కేంద్రం నుంచి యూరియా సరఫరా లేకపోవడంతో వచ్చిన దానిని సర్దుబాటు చేయలేక రాష్ట్ర ప్రభుత్వం సతమతమవుతోంది. యూరియా కోసం రైతులు అనేక చోట్ల రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. యూరియా సమస్యలపై ప్రతిపక్షాలు నిత్యం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. త్వరలో స్థానిక ఎన్నికలు ఉండడంతో అధికార కాంగ్రెస్‌కు ఈ సమస్య పెద్ద తలనొప్పిగా మారింది.

దిడ్డివాగులో గల్లంతైన వ్యక్తి మృతి

» మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు అందజేసిన ఎమ్మెల్యే

» వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఆదేశాలు



బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, సెప్టెంబర్ 12, (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం దిడ్డివాగులో గల్లంతైన వ్యక్తి శవమై కనిపించాడు. సంగెంకలాన్ గ్రామానికి చెందిన బుక్కంపల్లి మొగులప్ప(47) గురువారం చెట్టినాడు కర్మాగారం - సంగెంకలాన్ మధ్య దిడ్డివాగును దాటుతుండగా నీటి ఉధృతికి గల్లంతైన విషయం తెలిసిందే. నీటి ఉధృతి కారణంగా అధికారులకు గాలింపు చర్యల్లో ఇబ్బందులు తలెత్తాయి. శుక్రవారం తాండూరు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జలేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎస్‌డీఆర్ఎఫ్(స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) 16 మంది సిబ్బంది దిడ్డి వాగులో గాలింపు చర్యలు చేపట్టారు. వీరు గ్రామ యువకుల సాయంతో గాలించారు. కాగా, దిడ్డివాగు నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని గ్రామ సమీపంలోని బొంగరంమోట ప్రాంతంలో మొగులప్ప మృతదేహం ఓ చెట్టుకు తట్టుకున్నట్లు గుర్తించారు. ఫైర్ సిబ్బంది అక్కడి నుంచి మృతదేహాన్ని బయటికి తీసుకువచ్చారు. అనంతరం మృతుని బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో గ్రామంలో బైఠాయించి తమకు న్యాయం చేయాలంటూ భీష్మించారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి విషయం వివరించారు. ఎమ్మెల్యే, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.5లక్షల విలువైన చెక్కును, అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల నగదును అందజేశారు. రైతుబీమా, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. వాగుపై బ్రిడ్జి నిర్మించే విధంగా చూడాలని కర్మాగారం యాజమాన్యాన్ని ఆదేశించారు. సంగెంకలాన్‌లో రెండు వాగులకు బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. మృతుని కుటుంబంలో చెట్టినాడు కర్మాగారంలో ఒకరికి ఉద్యోగంతో పాటు ప్రభుత్వం నుంచి అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, రాందాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విజయ్‌భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్ గౌడ్, నాపగప్ప, జగదీశ్వర్ ఉన్నారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రావుగళ్ల బాబు

మహేశ్వరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళల పింఛన్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న తహసీల్దార్ కార్యాలయాలు, 20న గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ఎమ్మెస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ పేర్కొన్నారు. ఈమేరకు మహాధర్నాకు సంబంధించి శుక్రవారం తుక్కుగూడలో సన్నాహక సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేల పెన్షన్ వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని పింఛన్‌దారులకు అండగా మంద కృష్ణ మాదిగ పోరాటాలకు సిద్ధమయ్యారని.. అందులో భాగంగానే ఈనెల 15, 20వ తేదీల్లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపునిచ్చామన్నారు. పింఛన్‌దారులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు బక్కని రవి, నర్సింహ, నాగభూషణ్, గణేష్, కృష్ణ, నవీన్, శ్రీశైలం, బాల్‌రాజ్, దానయ్య, అనీష్ పాల్గొన్నారు.

ఖజానా ఖాళీగా ఉన్నా 'కల్యాణలక్ష్మి'

» ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/కొత్తూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కొత్తూరు, నందిగామ మండలాల పరిధిలోని 80 మంది లబ్ధిదారులకు రూ.24 లక్షల విలువైన చెక్కులను స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంపై అప్పుల భారం ఉన్నా పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అలాగే కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ శివారులోని హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాలో కడప పీర్ బాయి ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి చాదర్‌ను దర్గాకు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, కాంగ్రెస్ మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహ, నాయకులు ఆగీర్ రవికుమార్ గుప్తా, ఎల్లారం శేఖర్‌రెడ్డి, రఘు, లింగంనాయక్, బాల్‌రాజ్‌గౌడ్, కొమ్ము కృష్ణ, అన్వర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాగిరెడ్డి తదితరులు

మొయినాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) ప్రకృతిని విధ్వంసం చేయడమంటే ప్రజలపై యుద్ధం చేయడమేనని రైతుకూలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి చిలుకూరులో బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు. శాంతి స్వావలంబన కోసం ఈనెల 20 నుంచి అక్టోబరు 3 వరకు బహుజన బతుకమ్మ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న చిలుకూరులో బహుజన బతుకమ్మ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి విమలక్క, అరుణోదయ బృందం హాజరవుతున్నట్లు తెలిపారు. మహిళలు అత్యక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. చిలుకూరు మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి, జెకరయ్య, మోహన్, కుమార్, ఈశ్వరయ్య, రాము, ప్రభాకర్, యాదయ్య, రవికుమార్. తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి

» రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జోత్స్నాశివారెడ్డి

కీసర, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జోత్స్నాశివారెడ్డి అన్నారు. శుక్రవారం కీసరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం, తదితర వివరాలను ప్రధానోపాధ్యాయుడు వంగేటి రాంరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో వంటశాలకు తాళం వేసుకున్నాడని ఉపాధ్యాయుడు తెలిపారు. స్పందించిన ఆమె కలెక్టర్ మన్ను చౌదరికి ఫోన్ చేసి సమస్యలను వివరించారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. 7, 8వ తరగతికి చెందిన కొంత మంది విద్యార్థులు తెలుగు మీడియంలోనే ఉన్నారని, వారిని ఇంగ్లిష్ మీడియంలోకి మార్చాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. వారం రోజుల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని, తాను కూడా హాజరు అవుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జమదగ్ని పాల్గొన్నారు.



రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బీజేపీ చీఫ్‌కు నాయకుల శుభాకాంక్షలు

కేశంపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు కేశంపేట బీజేపీ మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. యువ మోర్చా మాజీ అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్, సీనియర్ నాయకుడు రాము, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తట్టేపల్లి నరసింహ, మల్లికార్జున్, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అందె శ్రీనివాసులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

శంషాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్నవారు సరైన సమయంలో వైద్యం చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మోర్ఫ్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శంషాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి కళాశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ హిమబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

చేవెళ్లలో రేపు మెగా వైద్యశిబిరం

చేవెళ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఈనెల 14న(ఆదివారం) ఉచిత మెగా వైద్య శిబిరం చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థల చేవెళ్ల కన్వీనర్ రామగౌడ్, గోపాలచారి తెలిపారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఏచూరి ఆశయాలను సాధిద్దాం

- కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు
- సీతారాం ఏచూరి వర్ధంతి.. ఘన నివాళి


షాద్‌నగర్ : నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

షాద్‌నగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, దివంగత సీతారాం ఏచూరి ఆశయాలను సాధిద్దామని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని షాద్‌నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల


కందుకూరు : సీతారాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాంచందర్, బాల్‌రాజ్


యాచారం : మాల్‌లో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్.రాజు మాట్లాడుతూ ఏచూరి ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినప్పటికీ అణగారిన వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు శ్రీను నాయక్, నాయకులు వడ్ల చంద్రమౌళి, ఈశ్వర్ నాయక్, మీర్‌పేట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రాంచందర్ అన్నారు. మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఏచూరి వర్ధంతిని జరుపుకున్నారు. నాయకులు శ్రీనివాస్, సి.నరసింహ, సరస్వతి, ముంతాజ్‌బేగం, శ్రీలత, అనిత, అండాలు, సంధ్య, చంద్రకళ, శేఖర్ తదితరులున్నారు.

కడ్తాల్ : సీతారాం ఏచూరి వర్ధంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సీపీఎం మండల కన్వీనర్ పెంటయ్య హాజరయ్యారు. ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు సిద్దిగారి మహేశ్, సహాయ కార్యదర్శి వీరేశ్, నాయకులు వేణు, శివ, చింటు, తదితరులు ఉన్నారు.

యాచారం : పేదల సమస్యల పరిష్కారానికి ఏచూరి ఎంతో శ్రమించారని మండల సీపీఎం నాయకులు థావ్ నాయక్, చందూనాయక్‌లు అన్నారు. ఈమేరకు వారు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మాల్, మంతన్‌గౌరెల్లిలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పెద్దయ్య, కవిత, మారెమ్మ, శ్రీరాములు, సత్యనారాయణ, మణెమ్మ, వెంకటయ్య, గోపాల్, రాములు తదితరులున్నారు.


కడ్తాల : నివాళులర్పిస్తున్న నాయకులు

15న ప్రజా విచారణ కార్యక్రమం

యాచారం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా కమిషన్‌కు అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడానికి ఈనెల 15న సోమవారం రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్-మహిళా జనసున్వాయి పేరిట ప్రజావిచారణ కార్యక్రమం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహిస్తున్నారు. ఉదయం పది గంటలకు కార్యక్రమం ఉంటుందని జిల్లా సంక్షేమాధికారి ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు తమ ఫిర్యాదులను జాతీయ మ హిళా కమిషన్‌కు ఇవ్వాలని సూచించారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారం 311వ రోజుకు చేరాయి. జేఏసీ, పార్టీల నాయకులు, యువకులు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో.. జర దేఖో!

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. పోమాల్‌పల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడంతో నిదురం జంగయ్యకు చెందిన పాడి ఆవు విద్యుదాఘాతంతో చనిపోయింది. దీంతో రైతుకు రూ.70వేల నష్టం జరిగింది. కేశంపేట మండల కేంద్రంలో తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో ఇటీవల పోచమ్మ ఆలయంపై పనులు చేస్తున్న వలస కూలీకి కరెంగ్ షాక్‌తో చనిపోయాడు. ఇలా తరచూ మండలంలో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నా ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. అనేక ప్రాంతాల్లో ఒరిగిన స్తంభాలు, వదులుగా ఉన్న విద్యుత్ తీగలు దర్శనమిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

టాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేస్తాం

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌లను ఇప్పటికే గుర్తించాం. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. గ్రామాలలో తక్కువ ఎత్తులో ఉండే ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎవరికీ అందకుండా ఎత్తు పెంచుతున్నాం. ఫెన్సింగ్ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచె వేస్తాం.

- ఈశ్వర్, విద్యుత్‌శాఖ ఏఈ, కేశంపేట

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



షాబాద్/ శంకర్‌పల్లి : ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్

శంకర్‌పల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి మండలం మహాలింగపురంలోని సీఎంఆర్ గార్డెన్‌లో శుక్రవారం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ మోహన్, సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి. సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తాహెర్ అలీ, ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా ఉపాధ్యాయులు ఉన్నారు. కాగా, సమాజంలో అజ్ఞానం అనే చీకటిని తొలిగించి వెలుగులు నింపేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు డేవిడ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయులు నర్సింహులు, నాయకులు టీచర్లున్నారు.


ఆమనగల్లు : కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

కేశంపేట : ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలా శ్రవణ్‌రెడ్డి అన్నారు. పాటిగడ్డ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండల ఉత్తమ టీచర్లను సన్మానించారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, ఎంపీవో కిష్టయ్య, మాజీసర్పంచ్ శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులున్నారు.

విజ్ఞాన గనులు.. గురువులు

ఆమనగల్లు : అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే విజ్ఞానపు గనులు గురువులు అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్దన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు గురుపూజోత్సవం, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో పాండు, లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ జనార్దన్ రెడ్డి, జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, జోన్ చైర్మన్ లింగయ్యలతో కలిసి ఎమ్మెల్యే ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. లయన్స్‌క్లబ్ సభ్యులు, నాయకులు నటరాజ్ యాదయ్య, చంద్రశేఖర్, కండె సత్యనారాయణ, చేగూరి వెంకటేష్, జూలూరి రమేశ్, బీచ్యనాయక్, కసిరెడ్డి పురుషోత్తం రెడ్డి, పాష, బాలకృష్ణ, జంగయ్య, జగన్, కృష్ణనాయక్, విజయ్ నాయక్, హెచ్‌ఎం రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట : సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు


ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఆత్మ విశ్వాసం విజయానికి సోపానం

ఆమనగల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదల, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు, ఎంఈవో పాండు అన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ భవిష్యత్‌ను ఉన్నతంగా మలుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల శుక్రవారం ఫ్రెషర్స్ డేను స్థానిక భవాని గార్డెన్‌లో ప్రిన్సిపాల్ మాధవరావు అధ్యక్షతన నిర్వహించారు. పాపిశెట్టి రాముశ్వేత దంపతులు, ఎంఈవో పాండు, హెచ్‌ఎం రామలక్ష్మీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులను సత్కరించి అభినందించారు.

మొక్కలతోనే మానవ మనుగడ

షాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని మన్‌మర్రి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ అన్నారు. ఈమేరకు మండల పరిధిలోని మన్‌మర్రి ప్రాథమిక పాఠశాలలో కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా తల్లులు, పిల్లలు కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వెంకటమ్మ, విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


మన్‌మర్రిలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తల్లులు

ఆకట్టుకున్న టీఎల్‌ఎం మేళా


కొత్తూర్ : మేళాను తిలకిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొత్తూర్/కేశంపేట/మహేశ్వరం , సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ మండల కేంద్రంలోని శ్రీసైన్స్ మాడ్రన్ స్కూల్ ఆవరణలో టీఎల్‌ఎం(టీచింగ్ లర్నింగ్ మెటీరియల్) మేళా ఆకట్టుకుంది. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో 1నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించే బోధనోపకరణాలను టీఎల్‌ఎంలో ప్రదర్శనకు ఉంచారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంఈవో అంగోర్‌నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్‌లు మేళాను ప్రారంభించి, బోధనోపకరణాలను పరిశీలించారు. వివిధ ఆకృతులతో బోధనోపకరణాలను ఏర్పాటు చేసిన టీచర్లను అధికారులు అభినందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, నాయకులు వీరమోని దేవేందర్ ముదిరాజ్, గోపాల్‌గౌడ్, కరస్పాండెంట్ శివకుమార్, తదితరులున్నారు. కాగా, మొదటి బహుమతి ఎంపీపీఎస్-సిద్దాపూర్, ద్వితీయ బహుమతి ఎంపీపీఎస్-కొత్తూర్ హెచ్/డబ్ల్యూ, 3వ బహుమతి ఎంపీపీఎస్-పెంజర్ల, 4వ బహుమతి ఎంపీపీఎస్-ఇన్ముల్‌నర్వ, 5వ బహుమతి ఎంపీపీఎస్-మక్తగూడ పాఠశాలలు ఎంపికైనట్లు ఎంఈవో తెలిపారు. ఆ పాఠశాలలు జిల్లాకు ఎంపిక చేసినట్లు చెప్పారు. కాగా, టీఎల్‌ఎంతో విద్యార్థులకు సులువుగా పాఠ్యాంశాలు అర్థమవుతాయని ఇన్‌చార్జ్ ఎంఈవో చంద్రశేఖర్ అన్నారు. కేశంపేట మండలం పాటిగడ్డ సమీపంలోని అశోక్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు బోధనోపకరణాలను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలోనే కాకుండా టీచర్లు తయారు చేసిన వివిధ రకాల విద్యా బోధన సామగ్రిని ఉపయోగిస్తూ విద్యాబోధన చేయల్సిన అవసరం ఎంతైనా ఉందని మహేశ్వరం మండల విద్యాధికారి డాక్టర్ వి.కస్నానాయక్ అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎమ్ మేళా నిర్వహించారు. మండలంలోని 27 ప్రాథమిక, 13 ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన- అభ్యసన సామగ్రిని ఆయన పరిశీలించారు. రావిర్యాల, ఆకన్‌పల్లి, మన్‌సాన్‌పల్లి, మంఖాల్, తుక్కుగూడ, మొహబ్బత్‌నగర్, మహేశ్వరం, అమీర్‌పేట, తుమ్మలూరు, ఇమాంగూడ, సిరిగిరిపురం, జాండమర్రి తండా పాఠశాలల టీచర్లు 17న తుక్కుగూడలో జరిగే జిల్లాస్థాయి మేళాకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు.


మహేశ్వరం : కార్యక్రమంలో విద్యాధికారి కస్నానాయక్


కేశంపేట : మేళాలో ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్

భూ నిర్వాసితులకు అండగా ఉంటాం

కడ్తాల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలు, రియల్టర్లు, పెట్టుబడిదారుల మేలు కోసం రాష్ట్ర ప్రభుత్వం అలైన్‌మెంట్లు మార్చి సన్న, చిన్న కారు రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని, భూ నిర్వాసితులకు అండగా ఉంటామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి హెచ్చరించారు. అభివృద్ధి పనుల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. కడ్తాల మండల కేంద్రంలో 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూనిర్వాసితులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారం 5వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని జైపాల్ యాదవ్, ఆచారిలు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కడ్తాల సమీపంలోని రైతులు సాగు చేసుకొని జీవనం పొందుతున్న పంట పొలాల మీదుగా అలైన్‌మెంట్ చేపట్టడం సరికాదన్నారు. టవర్ల నిర్మాణం పనులు నిలిపివేసి అలైన్‌మెంట్‌ను మార్చే వరకు భూ నిర్వాసితుల పక్షాన పోరాటాలు సాగిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, కలెక్టర్‌లను కలిసి సమస్యను వివరించి అలైన్‌మెంట్‌ను మార్చేలా చూస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్షం ఏర్పాటుచేసి రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలని వారు సూచించారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తూ అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనూషా సత్య అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థల్లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత- ట్రాఫిక్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యూనివర్సిటీ చాన్సలర్ జీఎస్ కోహ్లీ, వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్ఎస్ సైనీ, ప్రిన్సిపాల్ డా.ఎస్.శ్రీనాథ్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రతన్‌సింగ్ మృతి పట్ల ప్రముఖుల సంతాపం

ఆమనగల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ వైస్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి ఠాకూర్ బాలాజీ సింగ్ తండ్రి రతన్‌సింగ్ ఠాకూర్ మృతిపట్ల పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు. కల్వకుర్తిలోని ఆయన నివాసంలో మృతదేహాన్ని ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, రాష్ట్ర విద్యాకమీషన్ సభ్యుడు వెంకటేశ్‌లు సందర్శించి నివాళులర్పించారు. బాలాజీ సింగ్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం, మాజీ జడ్పీటీసీలు తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : నేర పరిశోధనకు సీసీ కెమెరాలు ఎంతో దోహద పడతాయని సీఐ గంగాధర్ అన్నారు. సాలార్‌పూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ నాయకులు గుండ్ల శ్రీశైలం రూ.10 వేలు, గూడెపు సిలారి రూ.10 వేలు, గుమ్మడి చెన్నయ్య రూ.5వేలు విరాళం ప్రకటించారు. శుక్రవారం కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐకి చెక్కులు అందించారు. వారిని సీఐ సత్కరించి అభినందించారు.

యాచారం : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్ నిరంతరంగా చేపడుతున్నామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. శుక్రవారం యాచారం సొసైటీలో విలేకరులతో మాట్లాడారు. రాజీమార్గమే రాజమార్గమని, లోక్‌అదాలత్‌తో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. తాము సివిల్ కేసుల్లో తలదూర్చడం లేదని ఏసీపీ తెలిపారు. ఆయన వెంట యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కందుకూరు : ప్రతి నిత్యం పోషకాహారం తీసుకోకపోతే శరీరంలో అనేక లోపాలు తలెత్తుతాయని జాతీయ పోషకాహార సంస్థ-హైదరాబాద్ నిపుణులు డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. నేదునూరు మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో అందరికీ పోషకాహారంపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలంతో పాటు ఆహార పదార్థాలతో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. మనం తినే ఆహార పదార్థాలను పోషకాలు ఉన్న వాటిని మాత్రమే తీసుకోవాలని, లేనిపక్షంలో శరీరంలో అనేక లోపాలు కలిగి, ఇబ్బందికరంగా మారే పరిస్థితి వస్తుందన్నారు. డా.శ్రీను, సిద్దార్థ, రాహుల్ టీచర్లు ఉన్నారు.

క్రైం కార్నర్

భార్యను చంపిన కేసులో భర్త రిమాండ్


వెంకట్‌రెడ్డి

కొందుర్గు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): భార్యను చంపిన కేసులో భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్ తెలిపారు. రేగడి చిల్కమర్రి గ్రామానికి చెందిన కోపూరు జయమ్మ(50)ను బుధవారం రాత్రి భర్త వెంకట్‌రెడ్డి హత్యచేసి పరారయ్యాడు. హతురాలి కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేసిన పోలీసులు జయమ్మను హత్య చేసింది తన భర్తేనని తేల్చారు. ఈమేరకు నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవీందర్ వివరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఐదుగురి అరెస్టు..

రూ.లక్షా 63 వేలు స్వాధీనం

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని అయ్యప్ప కాలనీలోని ఓ ఇంట్లో గురువారం రాత్రి పేకాట ఆడుతుండగా సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో వెళ్లి దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.1,63,100లతో పాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఫరూక్‌నగర్ మండలం కందివనం గ్రామానికి చెందిన ఒకరు, చౌదరిగూడ గ్రామానికి చెందిన మరొకరితో పాటు పట్టణంలోని విజయ్ నగర్ కాలనీ, మెయిన్ రోడ్డుకు చెందిన ఇద్దరు, చౌదరిగూడ మండలం చలివేంద్రంపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

స్కూటీ డిక్కీలోంచి రూ.2.9 లక్షలు అపహరణ

శంకర్‌పల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తులు పార్కుచేసిన స్కూటీ డిక్కీలో ఉన్న రూ.2లక్షల 90వేలు అపహరించిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యూనియన్ బ్యాంక్ వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. శంకర్‌పల్లిలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన ప్రమోద్‌గౌడ్ ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అయితే, అతడి తల్లి ఇచ్చిన చిట్టీ డబ్బులు రూ.2లక్షల 90వేలు యూనియన్ బ్యాంకులో డిపాజిట్ చేసేందుకుగాను.. స్కూటీ డిక్కీలో పెట్టుకొని బ్యాంక్ వద్దకు వెళ్లాడు. అక్కడ జనం పెద్దసంఖ్యలో ఉండడం చూసి మళ్లీ వద్దామని తాను పని చేస్తున్న ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌వద్దకు వెళ్లి అక్కడే స్కూటీని పార్కు చేశాడు. ఈక్రమంలో ల్యాబ్‌లో పని ముగించుకొని బ్యాంకుకు వెళ్దామని బయటకు వచ్చి స్కూటీ డిక్కీలో ఉంచిన డబ్బులను పరిశీలించగా కన్పించలేదు. దాంతో ప్రమోద్‌గౌడ్ బోరున విలపించాడు. అనంతరం శంకర్‌పల్లి పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పెట్రోల్‌లో నీరుందంటూ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ వద్ద పవన్ పెట్రోలియం మార్ట్‌లో పెట్రోల్‌లో నీరు కలిసిందంటూ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఓ వినియోగదారుడు(మహేష్) శుక్రవారం ఫిర్యాదు చేశాడు. తన బ్రిజా కారులో గురువారం రాత్రి పవన్ పెట్రోలియం మార్ట్‌లో పెట్రోల్ కొట్టించానని.. ఉదయం కారు స్టార్ట్ అవ్వకపోవడంతో మెకానిక్‌కు చూపించానని మహేష్ తెలిపాడు. పెట్రోల్ ట్యాంకులో నీరు చేరి ఇంజన్ చెడిపోయిందని మెకానిక్ తెలిపాడని అన్నారు. దాంతో పెట్రోల్ పంపు సిబ్బందితో కొంతసేపు వాగ్వాదం జరిగింది. గతంలో కూడా ఇదే పంపులో ఒకటి రెండు ఘటనలు జరిగాయంటూ మహేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా, పెట్రోల్‌లో ఎలాంటి కల్తీ జరగలేదని.. అందులో ఇథనాల్ కలిసి ఉండటంతో కలర్‌లో తేడా ఉందంటూ సిబ్బంది సమాధానమిచ్చారు. పవన్ పెట్రోలియం మార్ట్‌లో పెట్రోల్‌లో నీరుందంటూ వచ్చిన ఫిర్యాదుపై న్యాయ సలహా మేరకు విచారణ చేస్తామని ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

బొలెరో-ఆటో ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కేశంపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బొలెరో, ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కేశంపేట మండలం కాకునూర్ రోడ్డులో చంద్రగార్డెన్ వద్ద శుక్రవారం రాత్రి బొలెరో వాహనం, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటో డ్రైవర్ కరోళ్ల రమేష్, కాకునూర్ గ్రామానికి చెందిన కూలీ రెజీనా పర్వీన్‌లు గాయపడ్డారు. స్థానికులు కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ చాపల యాదయ్యగా గుర్తించినట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మొయినాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) కాలిన గాయాలతో ఆసుపత్రిలోచేరి చికిత్స పొందుతున్న ఓ మహిళ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి కథనం మేరకు.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి సురంగల్ గ్రామానికి చెందిన మాల కృష్ణవేణి(28) తన భర్త అనిల్‌కుమార్ తరచూ గొడవపడేవారు. ఈనెల 9న రాత్రి భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. దాంతో మనస్తాపం చెందిన కృష్ణవేణి ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే కరెంట్ ఆయిల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన స్థానికులు వెంటనే మంటలార్పి ఆసుపత్రికి తరలించారు. హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందింది. కాగా, కృష్ణవేణికి కూతురు ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్లు అద్దెకు తీసుకొని విక్రయం

- నిందితుల్లో ఏఆర్ కానిస్టేబుల్
- ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి పక్కదారి
- ఒకరి అరెస్ట్.. ఆరు కార్లు స్వాధీనం

సిద్దిపేట క్రైం సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆయన ఏఆర్ కానిస్టేబుల్.. ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. అప్పులు తీర్చేందుకు.. మళ్లీ ఆన్‌లైన్ గేమ్స్ ఆడేందుకు తనకున్న పలుకుబడితో వరసకు సోదరుడైన మరొకరితో కలిసి కార్లు అద్దెకు తీసుకొని.. అమ్ముకునేవారు. కార్లు అద్దెకు ఇచ్చిన వారి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ కేసులో ఐదుగురిని నిందితులుగా గుర్తించి అందులో ఒకరిని అరెస్ట్ చేసి, ఆరు కార్లను స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. జిల్లాలోని చిన్నకోడూరుకు చెందిన మిద్దెల మహేష్ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన మహేష్ అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చేందుకు అడ్డదారిలో డబ్బు సంపాదించాలని భావించాడు. తనకు సోదరుడి వరుసయ్యే రాజన్న సిరిసిల్ల జిల్లా తంగెళ్లపల్లి మండలం బస్వాపూర్‌నకు చెందిన బూరుగుపల్లి శేఖర్‌తో కలిసి సెల్ఫ్ డ్రైవింగ్ కోసమని రోజుకు రూ.1,200 అద్దె ప్రతిపాదికన ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు నెలల్లో సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కార్లు అద్దెకు తీసుకున్నారు. అలా అద్దెకు తీసుకున్న కార్లలో కొన్నింటిని రంగారెడ్డి జిల్లా చర్లపటేల్‌గూడకు చెందిన పట్నం నరేష్‌రెడ్డి ద్వారా కుదువపెట్టి డబ్బులు తీసుకున్నారు. మరికొన్నింటిని రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్‌కు చెందిన ధనావత్ మత్రు, నల్గొండ జిల్లాకు చెందిన ధనావత్ సంతోష్‌లకు అమ్మారు. సిద్దిపేటకు చెందిన సమీర్ వీరికి ఐదు కార్లను అద్దెకు ఇవ్వగా కొన్ని రోజులు సక్రమంగా అద్దె చెల్లించి తర్వాత ఆపేశారు. దీంతో సమీర్ ఇద్దరినీ నిలదీశారు. దాటవేస్తుండటంతో సిద్దిపేట టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుల్లో ఒకరైన పట్నం నరేష్‌ను అరెస్టు చేసి, వివరాలు రాబట్టారు. ఇబ్రహీంపట్నం వెళ్లి ఆరు కార్లను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారని, వారి వద్ద మరో నాలుగు కార్లు ఉన్నాయని మీడియాతో సీఐ తెలిపారు.